నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR

మార్చి 3 నుంచి పల్స్ పోలియో

విద్యానగర్, ఫిబ్రవరి 26 : మార్చి 3, 4, 5 తేదీల్లో ప్రతి చిన్నారికి వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేయాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుజాతతోపాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొనగా, ఆమె దిశా నిర్దేశం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 89,273 మంది ఉన్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 545 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, అర్బన్ ప్రాంతాల్లో 150, గ్రామీణ ప్రాంతాల్లో 395 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి జువేరియా, డీఐవో సాజిత హతహరి, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అథల్ నిగామె, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సఖి అడ్మినిస్ట్రేటర్ లక్ష్మి, డీఎంహెచ్‌వో డెమో రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌లో వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఈవీఎంల గోదాం పరిశీలన

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : కరీంనగర్ కలెక్టరేట్ సమీపంలోని ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల గోడౌన్‌ను కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో కొనసాగుతున్న రెండో స్థాయి తనిఖీ కార్యక్రమాన్ని పరిశీలించి, ఈవీఎంల తనిఖీ, మాక్‌పోలింగ్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలను జాగ్రత్తగా తనిఖీ చేయాలని సూచించారు. ఎస్‌డీసీ కిరణ్ ప్రకాశ్, తహసీల్దార్ రమేశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీవాణి, పలు రాజకీయపార్టీల ప్రతినిధులు సత్తినేని శ్రీనివాస్, కే రాజిరెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, మిల్కూరి వాసుదేవరెడ్డి, బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, నేరెళ్ల అంజయ్య, తదితరులు కలెక్టర్‌తో కలిసి ఎస్ఎల్‌సీని పరిశీలించారు.

దళితులపై దౌర్జన్యం

- ప్రజావాణిలో విన్నవించేందుకు వెళ్తున్న దళితబంధు లబ్ధిదారులపై పోలీసుల ప్రతాపం • ఎక్కడికక్కడే అరెస్టులు
- ఖాకీల తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం
- కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన

'తమది ప్రజాప్రభుత్వమని, సామాన్యులు సైతం సమస్యల కోసం నేరుగా అధికారులు, మంత్రులను కలవవచ్చని, అవసరమైతే ఆందోళనలు కూడా చేసుకోవచ్చని' ఊదరగొట్టిన రేవంత్ సర్కారు ఆచరణలో విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వం కొలువుదిరి ముచ్చటగా మూడు నెలలైనా కాకముందే జులుం ప్రదర్శిస్తున్నది. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట జరిగిన ఘటనే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. దళితబంధు రెండో విడుత నిధులు ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించడానికి వస్తే గేటులోకి రాకుండానే తమపై పోలీసులు దౌర్జన్యం చేయడంపై దళితలోకం మండిపడుతున్నది.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దళితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మహిళను బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 26: దళితబంధు రెండో విడుత నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేయాలని ప్రజావాణిలో విన్నవించేందుకు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌కు వచ్చిన లబ్ధిదారులపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. ఎక్కడివారినక్కడే అడ్డగించి బలవంతంగా పోలీసు వ్యానులు, జీబుల్లోకి నెట్టి, పోలీసు శిక్షణ కళాశాలకు తరలించారు. మహిళలు అని కూడా చూడకుండా లాక్కెళ్లి, వ్యాన్లలోకి ఎక్కించారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై విరుచుకుపడ్డారు. దీని ని నిరసిస్తూ పలువురు దళితయువకులు కలెక్టరేట్ రోడ్డుపై మెరుపు ధర్నాకు దిగారు. 'సీఎం రేవంత్ డౌన్.. డౌన్' అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్, పలువురు ఎస్ఐలు, డిస్ట్రిక్ట్ గార్డులు యువకులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. దళితబంధు రెండో విడుత నిధుల నిలిపివేతపై కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుంటే దుర్మార్గంగా వ్యవహరించడమేంటని నిలదీశారు. మహిళలు శాపనార్థాలు పెట్టారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున కార్యాలయానికి వచ్చి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. దీంతో పదుల సంఖ్యలో ఆందోళనకారులు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. 'సమస్య జఠిలంగా మారడానికి కారకుడవు నీవే'నంటూ నిలదీశారు. దీంతో, ఆయన ప్రజావాణికి తిరిగి వెళ్లిపోయారు. పదిరోజుల్లో సమస్య పరిష్కరిస్తానని చెప్పిన సంబంధిత అధికారి నెల గడిచినా విచారణ పూర్తి చేయలేదని ఆరోపించారు. కాగా, సుమారు 500 మందికి పైగా దళితులను పోలీసు వాహనాల్లో తరలించగా, వీరందరిని సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

దళితులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

డీ83 కెనాల్ ద్వారా సాగునీరివ్వండి

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు • 'నమస్తే' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

పెద్దపల్లి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : డీ83 కెనాల్ ద్వారా మంథని ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని సీఈ సుధాకర్‌రెడ్డిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. డీ83 పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పొలాలు ఎండే ముప్పు ఉండడం, సాగునీరివ్వాలని రైతులు విజ్ఞప్తి చేయడం, దీనిపై సోమవారం నమస్తే తెలంగాణలో 'నీళ్లు లేక నెరెలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో మంత్రి స్పందించారు. ఈ మేరకు డీ 83 కెనాల్ నుంచి గుండారం నుంచి కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలాల్లో పొలాలకు మంగళవారం ఉదయం నుంచి నీరివ్వాలని సూచించారు. ఎగువ భాగంలో కాలువకు మోటర్లు పెట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అనుమతులు లేకుండా మోటార్లు పెట్టే రైతులకు కరెంట్ కట్ చేయాలని చెప్పారు. మంథని డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సాగునీరివ్వాలని సీఈని మంత్రి ఆదేశించారు.

శాతవాహనలో జాతీయ వర్క్‌షాప్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాంలాల్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 26 : శాతవాహన యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ అధ్యాపకులకు సోమవారం ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రిపరేషన్‌పై ఒక రోజు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీనోట్ స్పీకర్‌గా వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రాంలాల్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పరిశోధన చాలా అవసరమని, వారిలో విషయ నైపుణ్యాలను పెంపొందించేందుకు అధ్యాపకులకు ఇలాంటి వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థుల ప్రాజెక్ట్ రిపోర్ట్‌కి సంబంధించిన విధి విధానాలను ఈ వర్క్‌షాప్ ద్వారా అధ్యాపకులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులకు ప్రాజెక్ట్ రిపోర్ట్ చాలా అవసరమని, అందుకు అధ్యాపకులు మార్గ నిర్దేశకులుగా ఉండాలని చెప్పారు. డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ పరిశోధనలో భాగంగా విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్ట్ రిపోర్ట్ వారి ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు కీలకమన్నారు. ఇక్కడ డైరెక్టర్ డాక్టర్ డీ హరికాంత్, డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, నరేశ్, డాక్టర్ పరశురాములు ఉన్నారు.

కాంగ్రెస్ మోసం చేసింది

రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేస్తామని చెప్పి, ఓట్లేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసం చే సింది. ఇంత గొప్ప పథకం తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని అర్థమవుతున్నది. దళితుల బతుకుల్లో వెలుగులు నింపిన కేసీఆర్ ఖ్యాతిని కనుమరుగు చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని మేం భావిస్తున్నాం. అందుకే మా ఖాతాల్లోని డబ్బులను ఫ్రీజ్ చేసిన్రు. ఇప్పటికైనా నిధులను వెంటనే విడుదల చేయాలె. లేదంటే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి తగిన బుద్ధి చెబుతం.

- మోతె అర్జున్, జమ్మికుంట

అప్పడో మాట.. ఇప్పడో మాట

అసెంబ్లీ ఎన్నికలకు మందు రేవంత్‌రెడ్డి దళితబంధు నిధులు పెంచుతామని చెప్పిండు. ఇప్పుడేమో ఈస్కీంను మొత్తమే ఎత్తేయాలని చూస్తున్నడు. ఇది సరైంది కాదు. గత ప్రభుత్వం ఇప్పటికే మా ఖాతాల్లో రెండో విడత డబ్బులు వేసింది. కానీ, ఇప్పుడచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీజ్ చేయడం ఎందుకు. వెంట నే ఫ్రీజింగ్‌ను ఎత్తేసి నిరుపేద దళితులకు మేలు చేయాలి. లేదంటే ఓట్లకోసం వచ్చినప్పుడు తరిమికొడతం.

- మారపల్లి మహేందర్, కోమటిపల్లి (జమ్మికుంట)

కాంగ్రెస్ అండతోనే దౌర్జన్యం

శాంతియుతంగా ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్లినం. కానీ, పోలీసులు దౌర్జన్యం చేసిన్రు. బలవంతంగా లాక్కెళ్లి వాహనాల్లో ఎత్తిపడేసిన్రు. కాంగ్రెస్ ప్రభుత్వ అండతోనే మాపై దాడులు చేస్తున్రు. ఇది పద్ధతేనేనా..? కాంగ్రెస్ మీద మాకు నమ్మకముండె. ఇప్పుడా నమ్మకం పోయింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు మెమెంతో కృషి చేసినం. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి. లేదంటే పార్లమెంట్ ఎన్నికల్ల ఆ పార్టీని బొంద పెడుతం.

- జన్ని రవికుమార్, ఇల్లందకుంట (హుజూరాబాద్)

గేటు కాడికి రాకముందే అరెస్ట్ చేసిన్రు

కలెక్టర్ మేడంకు మాబాధ చెప్పుకునేందుకు వత్తే, పోలీసులు మమ్ములను దొంగలకన్నా అధ్వాన్నంగా చూస్తున్నరు. గేటు కాడికి రాకముందే వ్యాన్లకు ఎక్కించిన్రు. బలవంతం గా కాళ్లు, చేతులు పట్టి ఇసిరేసిన్రు. సానమందికి దెబ్బలు తగిలినయ్. మాకు ఇదివరకు కేసీఆర్ సర్కారు సగం పైసలు ఇచ్చింది. మిగతా పైసలు ఇత్తే యూనిట్లను మరింత పెంచుకుందామనుకున్నం. కానీ, కాంగ్రెస్ గవర్నమెంట్ అన్యాయం జేత్తున్నది.

- కొత్తూరి అయిలమ్మ, ఇల్లందకుంట

అరెస్ట్ చేయడమే ప్రజాపాలనా?

దళితులను అరెస్ట్ చేయడం హేయనీయం. నియోజకవర్గంలో 2800 మంది లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల దళితబంధు నిధులను విడుదల చేయాలి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ లబ్ధిదారుల అకౌంట్లో ₹10 లక్షలు జమ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఫ్రీజ్ చేసింది. ఇప్పటికే దళితబంధు గురించి అసెంబ్లీలో ప్రస్తావించాం. అయినా కాంగ్రెస్ సర్కారు ఇలాంటి దుర్మార్గాలకు ఒడిగట్టడం బాధాకరం. కరీంనగర్ జిల్లాలో పెద్ద మంత్రినని చెప్పుకునే వ్యక్తి దళితులను అరెస్ట్ ఎందుకు చేయించారు? ఇదేనా ప్రజాపాలన? వెంటనే నిధులు ఇవ్వాలి. లేదంటే ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- హుజూరాబాద్‌లో నల్లాచొక్క ధరించి నిరసన తెలిపిన అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

బీఆర్ఎస్‌పై కోపాన్ని దళితులపై చూపద్దు

ప్రజావాణిలో విజ్ఞప్తి చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన దళితులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం. కాంగ్రెస్ సర్కారు దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం. హుజూరాబాద్ నియోజకవర్గంలోని సుమారు 3వేల మంది లబ్ధిదారులకు రెండో విడుత దళితబంధు నిధులు ఇవ్వాల్సి ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసింది. కానీ, రేవంత్ సర్కారు నగదును ఫ్రీజ్ చేసి దళితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. నిరుపేద దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి. ఇలాంటి మంచి పథకాన్ని ఆపడం మంచిది కాదు. రేవంత్‌రెడ్డి సర్కారు బీఆర్ఎస్‌పై ఉన్న కోపాన్ని దళితులపై చూపద్దు.

- హుజూరాబాద్‌లో విలేకరులతో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

సమ్మక్క హుండీలో విదేశీ కరెన్సీ

గోదావరిఖని సమ్మక్క జాతర హుండీలలో వచ్చిన డాలర్లు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 26 : గోదావరిఖని సమ్మక్క జాతర హుండీకి విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గోదావరిఖని శివారు గోదావరి నదీ తీరంలో నిర్వహించిన జనగామ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించి హుండీల లెక్కింపును సోమవారం గోదావరిఖని సింగరేణి అతిథి గృహం పక్కన గల సారలమ్మ దేవాలయం లో నిర్వహించారు. కానుకలను లెక్కిస్తుండగా అమెరికాకు చెందిన 23 డాలర్లు ప్రత్యక్షమయ్యాయి. అందులో 20 డాలర్ నోటు ఒకటి, మూడు ఒక్కో డాలర్ నోట్లు వచ్చినట్లు కార్య నిర్వహణ అధికారి తెలిపారు.

ఎండుతున్న 'ఎలబోతారం'

- ఎస్సారెస్పీ వారబందీ పద్ధతికి మంగళం
- యాసంగిలో భరోసానివ్వని ఊర చెరువు
- సాగునీటి కోసం తండ్లాట
- వందల ఎకరాలు ప్రశ్నార్థకం
- ఆందోళనలో రైతులు

ఎలబోతారం గోసపడుతున్నది. నాడు పసిడి పంటలతో కళకళలాడిన ఆ పల్లె, ఇప్పుడు సాగునీటికి అల్లాడిపోతున్నది. ఇన్నాళ్లూ గ్రామానికి ఆదరువుగా ఉన్న ఊర చెరువు ఈ సారి భరోసా ఇవ్వకపోవడంతో వంద ఎకరాలను బీడు పెట్టాల్సి వచ్చింది. ఇక ఎస్సారెస్పీ డీ-89 కెనాల్ ద్వారా వారబందీ పద్ధతిన విడిచే నీటికి బ్రేక్ పడడంతో దాదాపు 200 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు భూగర్భజలాలు కూడా తగ్గుతుండడంతో 600 ఎకరాలు దెబ్బతినే ముప్పు కనిపిస్తున్నది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు పంటలను వదిలేయగా, మరికొందరు చేతికందివచ్చిన పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 26 : కరీంనగర్ నియోజకవర్గంలో సాగునీటికి కటకట మొదలైంది. మరీ ముఖ్యంగా రూరల్ మండలం ఎలబోతారం అల్లాడిపోతున్నది. గ్రామంలో 900 ఎకరాలపైనే సాగు భూములు ఉండగా, అందులో వంద ఎకరాల వరకు ఊర చెరువు కింద సాగవుతున్నది. అయితే గత కేసీఆర్ సర్కారు పాలనలో ఎస్సారెస్పీ డీ89 కెనాల్ ద్వారా ఆ చెరువును నింపారు. దాంతో రైతులు ఏ బాధా లేకుంట పంటలు పండించుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, సేద్యానికి భరోసా ఇవ్వకపోవడంతో రైతులు డైలామాలో పడిపోయారు. ఆశించిన స్థాయిలో ఊరచెరువులో నీళ్లు లేకపోవడంతో పరిస్థితిని ముందే ఊహించి ఈ యాసంగిలో సాగుకు దూరంగా ఉన్నారు. వంద ఎకరాలను బీడుగానే ఉంచారు. ఇక ఎస్సారెస్పీ డీ 89 కాలువ కింద మరో 200 ఎకరాలు సాగవుతుండగా, కేసీఆర్ సర్కారు ఏటా యాసంగిలో వారబంధీ పద్ధతిన నీరిచ్చేది. కానీ, ఈసారి అది కూడా గాడి తప్పింది. ఇప్పటివరకు మూడు సార్లు తడులను అందించాల్సి ఉండగా, 21 రోజుల కింద మూడు రోజులపాటు మాత్రమే విడుదల నీటిని చేశారు. ఇప్పటివరకు మరో రెండు విడుతలు ఇవ్వాల్సి ఉన్నా.. ఇవ్వకుండా చేతులెత్తేశారు. దీని ప్రభావం అంతటా కనిపిస్తున్నది. బోరుబావులు, బావుల ఆధారంగా 600 ఎకరాల వరకు ఏటా సాగవుతుండగా, ఈ సారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. భూగర్భజలాలు అడుగంటుతుండడం చూస్తే చివర వరకు పంటలు చేతికొచ్చుడు అనుమానంగానే కనిపిస్తున్నది. ఇప్పటికే గ్రామంలో పొలాలు, మక్క చేన్లు ఎండిపోతుండగా, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలను ఎలా కాపాడుకోవాలో..? తెలియక సతమతమవుతున్నారు. తాము కేసీఆర్ పదేళ్ల పాలనలో ఏ బాధా లేకుండ వ్యవసాయం చేసుకున్నామని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటి సమస్య అప్పుడే మొదలైందని మండిపడుతున్నారు. పంటలకు నీళ్లిచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

గుండె తరుక్కుపోతున్నది

పదేండ్లుగా రంది లేకుంట ఎవుసం చేసుకున్నం. కానీ ఈ సీజన్‌లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చెరువుల నీళ్లు లేక ఎకరం భూమి బీడుగా వదిలేశా. కాలువ కింద రెండెకరాలు వేస్తే నీళ్లు రాక ఎండిపోతంది. వారానికి నాలుగు రోజుల తడి ఇస్తే సరిపోయేది. కానీ 20 రోజుల కింద ఇచ్చి మరిచిపోయిన్రు. చేతికచ్చిన పంట ఎండిపోతుంటె గుండె తరుక్కుపోతున్నది. ఇప్పటికైనా అధికారులు నీటిని విడుదల చేయాలి.

- కొల్లాపూరి శంకయ్య, రైతు (ఎలబోతారం)

ఎండిన పొలంలో రైతు చల్ల ప్రభాకర్ రెడ్డి

పంట ఎలా చేతికివస్తది?

ఎస్సారెస్పీ డీ 89 కెనాల్ కింద వారబందీ పద్ధతిన నీళ్లు వస్తాయనే నమ్మకంతో ఎకరంలో వరి వేసిన. కానీ, అధికారులు నీళ్లు విడుదల చేస్తలేరు. 20 రోజుల కింద ఇచ్చి మరిచిపోయిన్రు. ఇలా అయితే పంట ఎలా చేతికివస్తుంది? మొత్తం పంట ఎండిపోయింది. మేకల మేతకు వదిలేసిన. కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఇలా అయితే రైతు ఎవుసం విడిచిపెట్టుడే అయితది.

- చల్ల ప్రభాకర్ రెడ్డి, రైతు (ఎలబోతారం)

ఇట్ల అయితదని అనుకోలె

నాకు ఐదెకరాల భూమి ఉంది. ఎస్సారెస్పీ కెనాల్ నుంచి నీళ్లు వస్తాయనే నమ్మకంతో వరి, మక్క వేసిన. వారబందీ పద్ధతిన నీళ్లిస్తామని చెప్పిన అధికారులు చెప్పి మాట తప్పిన్రు. నా పంట ఎండుతున్నది. చేతికి వస్తుందనే ఆశ లేదు. పదేండ్లుగా ఏ బాధా లేకుంట ఎవుసం చేసుకున్న. కానీ ఈ సారి ఇట్ల అయితదని అనుకోలె.

- వొల్లాల రాజిరెడ్డి, రైతు (ఎలబోతారం)

వారబందీ నీళ్లు అందించాలి

నాకున్న రెండెకరాల్లో వరి వేసిన. నీళ్లు లేక పంట ఎండుతున్నది. వారబందీ పద్ధతిన నీరందిస్తే మా పంటలకు చావులేకుండేది. గతంలో ఎపుడు ఇంత ఇబ్బంది కాలే. పుష్కలమైన జలాలతో ఎవుసం చేసుకున్న. ఇప్పుడు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఇలా అయితే ఎవుసం కష్టమే. ఇప్పటికైనా నీళ్లు అందించాలి.

- బుచ్చాల లచ్చయ్య, రైతు (ఎలబోతారం)

రైల్వే అధికారులు అవమానించారని..

- రైల్వే బోర్డు సభ్యుల ఆగ్రహం
- శంకుస్థాపన కార్యక్రమ బహిష్కరణ

బహిష్కరించి బయటకు వెళ్తూ పోలీసులతో మాట్లాడుతున్న బోర్డు, బీజేపీ నాయకులు

పెద్దపల్లి, ఫిబ్రవరి25: ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేపట్టిన పెద్దపల్లి రైల్వేస్టేషన్ అధునీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని రైల్వే బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు బహిష్కరించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా రూ.26.49 కోట్ల అంచనాతో చేపట్టనున్న పెద్దపల్లి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, అధునీకరణ పనుల ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసే కార్యక్రమానికి ఆహ్వానించి, వేదిక పైకి పిలువలేదని బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు పోల్సాని సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, దాడి సంతోశ్, మేకల శ్రీనివాస్, ఏ శ్రీకాంత్, కావేటి రాజగోపాల్, ఆవుల శ్రీనివాస్ రైల్వే అధికారులపై మండిపడ్డారు. ఇది కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని, కాంగ్రెస్ పార్టీ మీటింగ్ కాదని అసహనం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు.